క్లుప్తంగా

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



దుగ్గిరాల: దుగ్గిరాల, పెదపాలెం రోడ్డు నిర్మాణానికి విడుదలైన రూ.1.65 కోట్ల నిధులతో శనివారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. 3 కిలో మీటర్ల నుంచి 6.2 కిలో మీటర్ల వరకు నూతన బీటీ రోడ్డు నిర్మాణాన్ని మండలంలోని మోరంపూడి గ్రామంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ జబీన్, మార్కెట్ యార్డు చైర్మన్ వి.ఝాన్సీరాణి, కె.శ్రీ అనిత, వెనిగెళ్ల తదితర పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అమరావతి కంటి ఆసుపత్రి విజయవాడ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించామని, సుమారు 172 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అవసరమైన వారికి కళ్ల అద్దాలను అందించామని అన్నారు. కార్యక్రమంలో అమరావతి కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అలీ, బ్రాంచ్ హెడ్ పలగాని కోటిరత్నం, స్వరూప్, సౌమ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల బకాయిలు చెల్లించాలి



తాడేపల్లి రూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. శనివారం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరాన్ని ఆయన యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిమెంట్ ఫ్యాక్టరీ లాకౌట్ ప్రకటించి సుమారు 32 ఏళ్లు అవుతోందని.. ఇప్పటికీ కార్మికులకు రావాల్సిన బకాయిలు యాజమాన్యం చెల్లించలేదని విమర్శించారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల సమస్యలు అలాగే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, కొండయ్య, పిచ్చయ్య, ఆశీర్వాదం, గురవయ్య, ఇస్మాయిల్, దుర్గాభవాని, నాగేశ్వరరావు, షేక్ జానీ, లక్ష్మి, రమణమ్మ, ఇమాంబి, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాలకు తరలి వెళ్లిన ఎన్‌టీఆర్ విగ్రహాలు

తెనాలి అర్బన్: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 97వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ప్రతిష్ఠించేందుకు విగ్రహాలు శనివారం తెనాలిలోని సూర్య శిల్పశాల నుంచి తరలి వెళ్లాయి. వైఎస్సార్ కడప జిల్లా బ్రహ్మం గారి మఠం సమీపంలోని కమ్మ సత్రంలో ఒకటి, మైదుకూరు పట్టణంలో ఒకటి, అనంతపురం జిల్లా గుంతకల్లులో ప్రతిష్ఠించేందుకు భారీ కాంస్య విగ్రహాలు వెళ్లాయని శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, కాటూరి రవిచంద్ర తెలిపారు.

వైభవంగా హనుమత్ జయంత్యుత్సవాలు



తెనాలి: స్థానిక షరాఫ్ బజార్‌లో ఉన్న శ్రీ సువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో వార్షిక హనుమత్ జయంతి మహోత్సవాలు, 17వ లక్ష శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామికి విశేష పూజలు, శ్రీ మన్యు సూక్త హోమం, సింధూర అర్చనను ఆలయ వంశపారంపర్య అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం లక్ష శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 11 రోజులు పాటు జరిగే ఉత్సవాల్లో ప్రతిరోజు విశేష పూజలు, హోమాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

- ప్రతి క్షణం బహిరంగంగా మద్యం విక్రయాలు
- రెచ్చిపోతున్న మందు బాబులు
- పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు.. చోరీలు



బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న మందు బాబులు



మద్యం మత్తులో చెట్టుకు ఢీకొన్న వాహనం(ఫైల్)

మంగళగిరి: కూటమి ప్రభుత్వంలో మద్యం విక్రయాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఎక్కడ కావాలన్నా 24 గంటలూ మద్యం లభిస్తుంది. దీంతో మందు బాబులు రెచ్చిపోతున్నారు. గతంలో వారంలో 3 రోజులు తప్పనిసరిగా నగరంలోని ప్రధాన సెంటర్లలో పోలీసులు బ్రీత్ ఎన్‌లైజర్ పరీక్షలు నిర్వహించేవారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానాలు కూడా విధించేవారు. దీంతో మద్యం తాగే వారు పోలీసుల పరీక్షలకు ముందే ఇళ్లకు చేరుకునేవారు. కానీ ఏడాది కాలంగా పోలీసులు బ్రీత్ ఎన్‌లైజర్ పరీక్షలకు మంగళం పాడారు.

పుట్టుకొస్తున్న బెల్టు షాపులు..

టీడీపీ ప్రభుత్వం వైన్స్‌లు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు.. బార్‌లను రాత్రి 11 గంటల సమయం వరకు అని చెప్తున్నా ఎక్కడా నియమాలను పాటించడం లేదు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, గోపాలకృష్ణ థియేటర్, నగరంలోని పలు వైన్స్‌ల వద్ద 24 గంటలూ మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. వైన్స్‌లలో పని చేసే కొందరు సంచులు, బ్యాగ్‌లలో దాచి 24 గంటలూ విక్రయాలు కొనసాగిస్తున్నారు. కొన్ని బార్‌లు ఉదయం 8 గంటలకే తెరచి పక్క గేటుల ద్వారా యథేచ్ఛగా మద్యం విక్రయిస్తున్నారు. నగర పరిధిలోని గ్రామాలలో చిల్లర కొట్టులు, టీ కొట్టులు, టిఫిన్ సెంటర్‌లను అడ్డాలుగా చేసుకుని బెల్ట్ షాప్‌లను నిర్వహిస్తున్నారు. పుట్టుకొస్తున్న బెల్టు షాపుల్లో ప్రతి క్షణం మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయి.

మత్తులో ప్రమాదాలు..

మద్యం తాగిన వారు వాహనాలను ఇష్టానుసారం నడపడంతో ప్రమాదాలకు కారణమవుతున్నారు. రోడ్డు ప్రమాదాలకు అధికంగా మద్యం తాగి వాహనం నడిపే వారే కారణమవ్వడం గమనార్హం. బ్రీత్ ఎన్‌లైజర్ పరీక్షలు లేకపోవడం, మద్యం విక్రయాలకు అదుపు లేకపోవడంతో ప్రమాదాలతో పాటు చోరీలు పెరుగుతున్నాయి. కొందరు తాగుబోతులు కేవలం మద్యం కోసం దొంగతనాలకు పాల్పడుతూ అవే అలవాటు చేసుకుంటున్నారు. పోలీసులు, ప్రభుత్వం మద్యం అమ్మకాలను నియంత్రించేలా చర్యలు తీసుకుని తమను ప్రశాంతంగా జీవితం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



నగరంలో మద్యం షాప్‌లతో పాటు బార్‌లు తమకు ఇచ్చిన సమయంలోనే కొనసాగించాలి. లేదంటే తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం. బ్రీత్ ఎన్‌లైజర్ పరీక్షలు నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేసేలా చర్యలు చేపడతాం. సమయం పాటించకుండా మద్యం విక్రయించే షాప్‌లు, బార్‌లపై నిఘా ఏర్పాటు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుని మద్యం అమ్మకాలను నియంత్రించేలా చూస్తాం.

– మురళీ కృష్ణ, నార్త్ జోన్ డీఎస్పీ

8న అభయాంజనేయుని ఆలయ వార్షికోత్సవం



వేడుకలకు ముస్తాబు అయిన ఆలయం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని అభయాంజనేయస్వామి ఆలయం 8వ వార్షికోత్సవం జూన్ 8న నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్తలు ఎం.కోదండ రామతారకం, సూర్యనారాయణరావు, ఎం.వెంకట రమణారావులు శనివారం తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రధాన స్వామి వారికి విశేష అర్చన, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహిస్తారన్నారు. 8 గంటలకు వేణు గోపాలస్వామివారి కల్యాణ మండపంలో స్నపన, తిరుమంజనం, హనుమత్ యజ్ఞం, పరవస్తు హనుమాన్ సూరి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అదే రోజు రాత్రి 7 నుంచి 9.30 గంటల వరకు స్వామి కీర్తనలు, తీర్థప్రసాదాలు అందజేస్తారని పేర్కొన్నారు.

మండలంలో 58.6 మి.మీ. వర్షం

దుగ్గిరాల: దుగ్గిరాల మండలంలో శనివారం ఉదయం ఉరుములు మెరుపుతో కూడిన వర్షం కురిసింది. దీంతో స్థానిక ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మండలంలో 58.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యిందని దుగ్గిరాల తాహసీల్దార్ కార్యాలయం అధికారులు వర్షమాపిని ద్వారా నమోదైన వివరాలను వెల్లడించారు.

ప్చ్.. ఎందుకు ఆగిపోయిందో ?

- అసంపూర్తిగా భోజనశాల నిర్మాణం
- మధ్యలో పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్
- ఇబ్బందులు పడుతున్న చినరావూరు గ్రామస్తులు
- నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 20 లక్షలు మంజూరు

తెనాలి అర్బన్: చినరావూరులోని కమ్యూనిటీ హాల్ పక్కన భోజనశాల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. మున్సిపల్ అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ఆ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అప్పటి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చినరావూరులో పర్యటించారు. ఆ సమయంలో ఆ ప్రాంతవాసులు లూథరన్ చర్చి ముందు ఉన్న మున్సిపల్ స్థలంలో ఉన్న కమ్యూనిటీ హాల్ పక్కన భోజనశాల నిర్మించాలని కోరారు. అప్పటి ప్రభుత్వం 13వ వార్డుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.20 లక్షలను మంజూరు చేసింది. వాటిని భోజనశాల నిర్మాణానికి ఉపయోగించాలని కౌన్సిలర్ కుర్రా సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు కుర్రా శ్రీను కోరారు. ఎమ్మెల్యే శివకుమార్ వారి అభ్యర్థన మేరకు నిధులు కేటాయించారు. వీటితో రేకులు షెడ్డుతో పాటు సీలింగ్, ఫ్యాన్లు, టైల్స్, బాత్ రూమ్స్, వాష్‌బేషిన్‌ల నిర్మాణాలు చేయాలి. అప్పటి కాంట్రాక్టర్ షెడ్డు నిర్మాణం చేసి మిగిలిన వర్క్స్ నిలిపివేసినట్లు కౌన్సిలర్ సుజాత తెలిపారు. 13, 14, 15 వార్డులలోని పేదలు కమ్యూనిటీ హాల్‌ను ఎక్కువగా ఉపయోగించుకుంటూ ఉంటారు. పక్కనున్న భోజనశాల అసంపూర్తిగా ఉండటం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మిగిలిన పనులు కూడా పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు సహకార భవనం శంకుస్థాపన

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో కార్మిక వినియోగదారుల సహకార సంఘం భవన శంకుస్థాపన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు తాడేపల్లిలోని సుందరయ్య నగర్‌లోని లీలా సుందరయ్య కళావేదిక వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. వినియోగదారులు, కార్మికులకు మధ్య అనుసంధానంగా కార్మిక వినియోగదారుల సహకార సంఘం ఏర్పాటు చేశామని.. దాతల సహకారంతో ఈ భవన నిర్మాణం జరగనున్నదని నిర్వాహకులు ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు ఛత్రపతి శివాజీ నాటక ప్రదర్శన

తెనాలి: కళ,సాహిత్యాల అఖిల భారతీయ సంస్థ సంస్కార భారతి, ఆంధ్రప్రదేశ్, సీబీఆర్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ సంయుక్త నిర్వహణలో తెనాలిలో చారిత్రాత్మక నాటకం 'జయహో శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్' ప్రదర్శించనున్నారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళా క్షేత్రంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు నాటక ప్రదర్శన ఉంటుందని శివాజీ స్మారక సమితి, హిందూ చైతన్య వేదిక, తెనాలి నిర్వాహకులు తెలియజేశారు. తొలిసారిగా డిజిటల్ టెక్నాలజీతో ప్రదర్శించనున్న ఈ నాటకంలో విజయవాడకు చెందిన డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి శ్రీ సాయిబాబా నాట్య మండలి కళాకారులు 60 మంది నటిస్తారని తెలిపారు. సంస్కార భారతి, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ పీవీఎస్ కృష్ణ రచించిన ఈ నాటకాన్ని ఆయన దర్శకత్వంలోనే ప్రదర్శిస్తారని, హైదరాబాద్‌లోని సీబీఆర్ అకాడమి ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ అధినేత చలసాని బలరామయ్య సహకారం అందిస్తున్నట్లు వివరించారు. ఛత్రపతి శివాజీ పట్టాభిషేక మహోత్సవాల్లో భాగంగా జూన్ 8న సాయంత్రం 4 గంటలకు తెనాలిలో శోభాయాత్రను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ



రక్తదాత డాక్టర్ ఉమాశంకర్‌ను అభినందిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ అరుణ, పక్కన డాక్టర్ రాజకుమారి

గుంటూరు మెడికల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఒకరు చేసే రక్తదానంతో నలుగురికి నూతన జీవితాన్ని ప్రసాదించవచ్చని మాజీ మంత్రి, బీజేపీ నాయకురాలు డాక్టర్ శనక్కాయల అరుణ అన్నారు. శనివారం స్థానిక కొత్తపేటలోని అహల్య నర్సింగ్ హోమ్‌లో నిర్వాహకురాలు, ప్రముఖ ఐవీఎఫ్ స్పెషలిస్టు డాక్టర్ శనక్కాయల రాజకుమారి పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది తలసీమియా చిన్నారుల కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. మాజీ మంత్రి డాక్టర్ అరుణ మాట్లాడుతూ తలసీమియా బాధితులకు జీవితాంతం రక్తం మారుస్తూ ఉండాలని చెప్పారు. అలాంటివారి కోసం ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేరని, ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడవచ్చన్నారు. రక్తదానంపై అపోహలు వీడి, యువత స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ పిలుపునిచ్చారు. స్వచ్ఛందంగా ఆయన రక్తదానం చేసి రక్తదానం చేసిన వైద్యులు, వైద్య సిబ్బందికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

టెండర్ పొందిన వారే చెత్త తరలించాలి

మేయర్ రవీంద్ర



మార్కెట్‌లో పర్యటిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగర పాలక సంస్థ పరిధిలో హోల్‌సేల్ మార్కెట్లలలో ఆశీలు వసూలుకు టెండర్ పొందిన వారే నిర్దేశిత ప్రాంతంలోనే ఆశీలు వసూలు చేయడంతో పాటు ఆయా ప్రాంతాలలో వ్యర్థాలను కూడా వారే తొలగించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. శనివారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలసి బండ్ల బజార్(హోల్ సేల్ ఫ్రూట్ మార్కెట్), లాలాపేట, పట్నంబజార్, ఆదర్శ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్లీన్ – గ్రీన్ గుంటూరు కోసం నగర పాలక సంస్థ అన్ని విభాగాలు ప్రత్యేక దృష్టితో కృషి చేస్తున్నామని, ఇందుకు నగర ప్రజలు, వ్యాపార సంస్థలు సహకరించాలని కోరారు. నగర నడిబొడ్డులోని పట్నంబజారులో ప్రతి రోజు క్వింటాళ్ల కొద్దీ వ్యర్థాలు వస్తున్నాయని, వాటిని సరైన పద్ధతిలో తొలగించకపోవడం వలన స్థానికంగా తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు గత కొంతకాలంగా అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. అదనపు కార్మికులు, వాహనాలు, పుష్ కార్ట్స్, సామగ్రిని అందించామని చెప్పారు. శానిటరీ వార్డుల వారీగా ఉదయం సాయంత్రం పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. లాలాపేట, పట్నం బజారు, బండ్ల బజారు ప్రాంతాలలో హోల్ సేల్ వ్యాపారస్తుల నుంచి ఆశీలు వసూలు చేసే టెండర్ దారు ఆయా ప్రాంతాల పరిశుభ్రత బాధ్యత తీసుకోవాలని కోరారు. ఆదర్శ నగర్‌లో తాగునీటి సరఫరాపై అందిన ఫిర్యాదు ప్రాంతాన్ని పరిశీలించి, సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇంజిరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్లు మహమ్మద్ చిష్టి, ఈరంటి వరప్రసాద్, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

తెనాలి అర్బన్: యోగాతో శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. యోగా ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో బోసు రోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శనివారం యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ శిబిరాన్ని కమిషనర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ యోగా దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం నిర్వహించనున్నట్లు చెప్పారు. విశాఖపట్నంలో జరిగే వేడుకల్లో ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా పాల్గొంటారని వివరించారు. రోజూ తెనాలి పట్టణంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతిరావు, ఆర్వో రాంప్రసాద్, మున్సిపల్ అధికారులు, యోగ సాధకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెహ్రూనగర్: గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో రూ.3.15 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర శనివారం శంకుస్థాపన చేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 54, 56 డివిజన్లలో రూ.2.43 కోట్లతో, పశ్చిమ నియోజకవర్గంలోని 45వ డివిజన్లో రూ.72.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి పైప్‌లైన్లు ఏర్పాటుకు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నజీర్ మహ్మద్, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గల్లా మాధవిలతో కలిసి శంకుస్థాపన చేశారు. మేయర్ మాట్లాడుతూ నగరంలో చిన్నపాటి వర్షానికే రోడ్ల పై వర్షపు నీరు నిలిచి స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీటిని దృష్టిలో పెట్టుకొని స్థానిక ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. గుంటూరు నగరంతోపాటు నగరంలో విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు పార్టీలకతీతంగా ప్రాధాన్యతా క్రమంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొమ్మినేని కోటేశ్వరరావు, అయిశెట్టి కనకదుర్గ, మల్లవరపు రమ్య, ఈరంటి వరప్రసాద్, ఈఈ సుందర్రామిరెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర యాప్‌పై అవగాహన



కార్యక్రమంలో మెప్మా అధికారులు

మంగళగిరి టౌన్: జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో యోగాంధ్ర యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని అధికారులు చేపడుతున్నారు. మంగళగిరి నగర పరిధిలోని ఎంటీఎంసీ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా ఆర్పీలకు యోగాంధ్ర యాప్‌పై శనివారం అవగాహన కల్పించారు. మెప్మా అధికారులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఈ యోగాంధ్ర యాప్‌లో నమోదు కావాలని సూచించారు. జూన్ 21న విశాఖపట్నంలో జరగనున్న యోగ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరికీ యోగాపై అవగాహన కల్పిస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో మెప్మా మంగళగిరి సిటీ మిషన్ మేనేజర్ మాలతి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు సుధాకర్, నాగజ్యోతి, డ్వాక్రా సంఘాల ఆర్పీలు పాల్గొన్నారు.

దేశానికి ఐక్యంగా నిలబడాలి

మంగళగిరి: కశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడి కుల మతాల మధ్య జరిగింది కాదని.. భారతీయుల మీద జరిగిన దాడి అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈమని అప్పారావు అన్నారు. శనివారం ఆత్మకూరు గ్రామంలో యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా సమైక్యత సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదులు కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు భారతీయులపై అమానుషంగా దాడి చేసి 26 మంది బలిగొన్నారని అన్నారు. ఉగ్రవాదాన్ని అణచివేసే దిశగా దేశ వ్యాప్తంగా భారతీయులందరూ కులమతాలకు అతీతంగా ఐక్యంగా నిలబడాలని కోరారు. దేశంలో మత కలహాలు సృష్టించేందుకు కొందరు సోషల్ మీడియాలో పాల్పడుతున్నారని ఆరోపించారు. సామాజిక మాధ్యమాల్లో కొందరి అనుచిత వ్యాఖ్యలు సైన్య పోరాట పటిమను దెబ్బ తీస్తాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బిట్రా రాంబాబు, సీతారామయ్య, జి.లక్ష్మి, వి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పన్నుల సమాచారానికి సచివాలయాల్లో సంప్రదించాలి

మంగళగిరి, మంగళగిరి టౌన్: ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులకు సంబంధించి సమాచారం తెలుసుకోవాలంటే తమ పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాలను సంప్రదించాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటి పన్నుల పేరు మార్పులు, ఖాళీ స్థలానికి సంబంధించి ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే ఎంటీఎంసీ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయాలని కోరారు. ఆ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు ప్రముఖ శిల్పకారులకు సత్కారం

తెనాలి: ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ మానవత, తెనాలి శాఖ సర్వసభ్య సమావేశం ఆదివారం ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ లైబ్రరీ ఆవరణలో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నారు. సమావేశానికి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహిస్తారు. ఏడు తరాలుగా శిల్పకళకు అంకితమైన కుటుంబం నుంచి వచ్చి, ఆ కళా వారసత్వాన్ని నాలుగు దశాబ్దాలుగా కొనసాగిస్తున్న కాటూరి వెంకటేశ్వరరావు, ఆయన కుమారులు కాటూరి రవిచంద్ర, కాటూరి శ్రీహర్షను ఇదే సమావేశంలో సత్కరిస్తారు. శిల్పకళతో జాతీయ, అంతర్జాతీయ గుర్తింపును పొందిన కాటూరి వెంకటేశ్వరరావు ఇటీవల రాష్ట్రప్రభుత్వ 'కళారత్న' అవార్డును స్వీకరించిన విషయం తెలిసిందే. ఆయన కుమారులైన రవిచంద్ర గవర్నర్ అవార్డును, కాటూరి శ్రీహర్ష కొండూరి వీరరాఘవాచార్యులు పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా శిల్పకళా కుటుంబాన్ని 'మానవత' సత్కరించనుందని డాక్టర్ రామ్‌చంద్ వెల్లడించారు.

కూలిన శివాలయం ప్రహరీ



అర్ధరాత్రి కూలిన ప్రహరీ

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులోని శ్రీ గంగా పార్వతీ సమేత దండేశ్వరాలయం (శివాలయం) తూర్పు ప్రహరీ గోడ శుక్రవారం అర్ధరాత్రి కూలిపోయింది. గత వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా ఆలయ ప్రహరీ గోడ నేలకొరిగి ఉంటుందని అర్చకులు, స్థానికులు భావిస్తున్నారు. వర్షానికి తడిసిన గోడ రాళ్ల గుట్ట పక్కనే ఉన్న సీసీ రోడ్డుపై పడిపోయింది. అర్ధరాత్రి జనసంచారం లేని సమయం కావడంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు. కూలిన ప్రదేశంలోనే బావి, నవగ్రహాలు ఉంటాయి. అదే భక్తుల తాకిడి ఉన్న సమయంలో జరిగి ఉంటే పెనుప్రమాదం సంభవించి ఉండేది. ఉదయాన్నే ఆలయానికి వచ్చిన అర్చకులు పత్తిపాటి పరమేశ్వర శర్మ గోడ కూలిపోయి ఉండడాన్ని గమనించి విషయాన్ని దేవదాయశాఖ అధికారులకు తెలియజేశారు. గతంలోనూ ఉత్తరం, పడమర, దక్షిణ దిక్కుల్లోని ప్రహరీ గోడలు పడిపోయిన సందర్భాలు ఉన్నాయి. తాజాగా ఇప్పుడు మిగిలిన నాలుగో దిక్కు ప్రహరీ గోడ కూలిపోవడం స్థానికంగా చర్చనీయాంశమయ్యింది.

అగ్రికల్చర్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రత్తిపాడు: మండల పరిధిలోని యనమదల బి.ఆర్ అండ్ ధనలక్ష్మి పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్ కళాశాలలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. అగ్రికల్చర్ పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులకు విజయవాడ సమీపంలోని తిరువూరుకు చెందిన సాయిల్ సే ఆర్గానిక్ వెజిటబుల్ ప్రొడక్షన్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 12 మంది ఎంపికయ్యారు. కంపెనీ ప్రతినిధులు రాత పరీక్షలతో పాటు మౌఖిక ఇంటర్వ్యూలను జరిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బచ్చు శ్రీనివాస్ రావు, డైరెక్టర్ బచ్చు కిరణ్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ అమృత గాయత్రి, కళాశాల ఇన్‌చార్జి భాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు బలి

గుంటూరు మెడికల్: వైద్యులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతోనే యువకుడి ప్రాణం పోయిందని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా ఆరోపించారు. జీజీహెచ్‌లో వైద్యుల నిర్లక్ష్యంతో చనిపోయిన యువకుడి కుటుంబ సభ్యులను షేక్ నూరిఫాతిమా పరామర్శించారు. యువకుడి భౌతికాయాన్ని సందర్శించి మృతికి గల కారణాలు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ జనరల్ వార్డుకు తరలించిన నాలుగు గంటల వ్యవధిలోనే సైదా చనిపోవడం వైద్యుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. యువకుడి మృతిపై ఆసుపత్రి అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. యువకుడి మృతిపై తక్షణమే విచారణ జరిపించి న్యాయం చేయాలన్నారు. వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనలో వైద్య రంగం ఎంతో అభివృద్ధి చెందిందని, ముఖ్యంగా గుంటూరు జీజీహెచ్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి అభివృద్ధికి కేరాఫ్‌గా ఆసుపత్రిని తీర్చిదిద్దారన్నారు. నేటి ప్రభుత్వం జీజీహెచ్‌ను పట్టించుకోవడం లేదని, అందువల్లే నిర్లక్ష్యం కనిపిస్తుందన్నారు.

ప్రజాప్రతినిధులు జీజీహెచ్ రూపు రేఖలు మార్చామంటూ చెబుతున్నప్పటికీ నిర్లక్ష్యం ఏమాత్రం మారలేదన్నారు. యువకుడి కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. కడుపు నొప్పితో బాధపడుతూ మూడు రోజుల క్రితం క్యాజువాలిటీకి చికిత్స కోసం వెళ్లిన షేక్ సైదాను క్యాజువాల్టీలో పరీక్షించిన వైద్యులు ఐసీయూకు తరలించారు. ఐసీయూలో పూర్తి చికిత్స అందించకుండానే వైద్యులు పట్టించుకోకుండా 104 వార్డుకు తరలించారని, అందువల్లే తమ బిడ్డ చనిపోయాడంటూ సైదా కుటుంబ సభ్యులు మీడియాకు వెల్లడించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com